ముద్దుకృష్ణ

రాయసం వెంకటశివుడు గారు

ప్రొద్దుననుండియు ముద్దుకృష్ణ, మేడ గవాక్షముయొద్దనే కూర్చుండి యుండెను. ఆకసమున తొలుదొల్త నొకటి రెండు మబ్బుజీరలు గానిపించి చూచుచుండఁగనే యిటునటు వ్యాపించెను. "నేఁడు వాన కురియదుగదా" యని యాయువకుఁడు వెఱఁగొందెను. అతఁ డనుకొనినట్లుగనే కొంచెము తుషారము పడెను. అంత నతనిసంశయమును శమింపఁజేయుటకో యనునట్లుగ గగనమున వెలుతురు గానిపించెను. ఇఁక భయపడనక్కఱ లేదని యాపిన్నవాఁడు ధైర్యమందెనుగాని వెంటనే తిరిగి యాకాశము మేఘావృత మయ్యెను. ప్రాతఃకాలము నందలి తుంపరవంటిదిగాక ఇపుడు వంచివాన కురియఁ దొడంగెను. చేయునదేమియు లేక ముద్దుకృష్ణ కిటికీ నుండి చూచుచుండెను.

గగనమంతయు కారుమబ్బు క్రమ్మియుండెను. వర్షము కురియుచుండుటచేత జనులు తమ కుటీరముల నిలచి యుండిరి. అందువలన వానసద్దుతప్ప గ్రామమున మఱియేసద్దును గానరాకుండెను.

సంతతధారగ నిపుడు కురియుచుండెడి వర్షము ముద్దుకృష్ట మనోరథములను ముంచివేసెడి వెల్లువ వలె వానికనుల కగపడెను. ఫెళ్లుఫెళ్లుగ వీచెడి వాయువు వానికోరికల నెగురఁజిమ్మ మహావాయువుగఁ గానిపించెను! ముద్దుకృష్ణ కీయలజడియేల ?

ఈ మిన్నూరు గ్రామము మొన్న మొన్నఁటి వఱకును ఈప్రాంతములందు ప్రసిద్ధి కెక్కి యుండెను. మిన్నూరిరెడ్లు కులశేఖరులని పొగడ్తలనందిరి. మెట్టమాగాణిసేద్యములకు మిన్నూరివారు వాసికెక్కి యుండిరి. ఎంతటి ధనవంతులైనను వారు ప్రాలుమాలిక లేక తమ రైతులతోఁ గలసి పాటుపడుచుందురు కావుననే వారి యైశ్వర్యము స్థిరముగ నుండెను. ఇంతలో ప్రస్తుతము దేశము నావరించిన మిథ్యానాగరకతా ప్రభావమున మిన్నూరి రెడ్లలో సోమరితన మంకురించెను. వరిపొలములు, మాగాణిపైరులును వీడి యామహనీయు లిపుడు కాఫీశాలలు, నాటకశాలలును తమ విహారరంగములుగఁ జేకొనిరి. అంతకంతకు పట్టణనివాసము ముంపెర మిన్నూరుసేద్యము దివిటీక్రింద దీపమయ్యెను! శ్రమకోర్చి పని చేయునలవాటు విడిచి కాలు కదల్చుటయె నీచమని వారు తలంచిరి. కావుననే మోటారుమీఁద విహారము, వేశ్యలతో వినోదమును వారికి విడరాని విధు లయ్యెను. వారిలోఁ గొందఱికి రానురాను నెల్లూరు నివాసమె కుగ్రామనివాసముకాఁగా వారు చెన్నపట్టణమునకుఁ దమ పీఠమును తరలించిరి. ఇట్లు నగరవిహారములను, పట్టణభోగములను మరగిన యా రెడ్లు శీఘ్రకాలములోనే యప్పులవారి చేతులలోఁ బడిరి.

మిన్నూరి మల్లారెడ్డిని, సోదరులను ఎఱుఁగని వారెవరు? సకలైశ్వర్యములకును ఉనికిపట్టని పొగడ్తల నందిన వారియాస్తి కాలక్రమమున సాహుకారుల చేతులలోనికిట్లు వచ్చెను. ఇట్టి యవస్థనెఁపక ఈ కుటుంబములోని కొందఱకాలమరణము నొందిరి. తక్కినవారు ఉక్కుచెడి ఇలా యొక చోటను తలదాఁచుకొనిరి. వీరు తమ వైరులమీఁదఁ దెచ్చిన యభియోగమున చెన్నపురమున నిన్ననే తుదితీరుపు చెప్పియుందురు. పర్యవసానము తంత్రీమూలమునఁ దెలియు నేర్పాటులు ముద్దుకృష్ణారెడ్డి చేసికొనెను గావున ఆ సమాచారము వినుటకతఁడు ఉవ్విళులూరుచుండెను. తంతి తెచ్చువారు దూరమున నుండగఁ గనిపెట్టుటకే ముద్దుకృష్ణ ప్రాతఃకాలము నుండియు గవాక్షమునొద్దఁ గనిపెట్టుకొని యుండెను. ఆవార్తమీఁదనె మనసుంచిన యాతనికి వాయువర్షముల తాకుఁ డంతగఁ దోఁపకుండెను. "గాలి బలమగుచున్నది; మేడదిగి రమ్మ"ని యెన్నిమాఱులు క్రిందినుండి యతనికి వార్త వెళ్లినను, లెక్కచేయక యతఁ డచటనే వేచియుండెను.

చినికిచినికి.గాలివాన యగునన్న చొప్పున సూర్యాస్తమయ సమయమునకు పరిస్థితులు ఘోరమయ్యెను.

గ్రామమందలి పూరియిండ్లు ఎగిరిపోఁజొచ్చెను. చెట్లకొమ్మలు విఱిగిపోసాగెను. చిన్నకుటీరముల నుండువారి గతి చూడగా ముద్దుకృష్ణునకుఁ జిరకాల మిత్రుఁడగు బావాజీసంగతి స్ఫురణమునకు వచ్చెను. ఇంతలోనే తన్ను క్రిందికిఁ దోడుకొనిపోవుటకుఁ బైకి వచ్చిన పరిచారకుని చేతి లాంతరు తాను జేతబూని, "వలదు, వలదు!" అని యింటనుండువారు వారించుచున్నను జమ్మాగూడ నెత్తి నిడుకొని ముద్దుకృష్ణ వీథినిబడెను.



"వలదు,వలదు!" అని యింటనుండువారు వారించుచున్నను జమ్మాగూడ నెత్తినిడుకొని ముద్దుకృష్ణ వీథినిబడెను.

౨

మిన్నారునకు ఆ ప్రక్కనుండిపోవు పెద్ద బాట చేరువనె యుండును. గ్రామమునుండి యచటికి పొలము గనిమలమీఁదనుండి నడచిపోవలయును. ఈ సన్నని త్రోవను నడచునపుడు పలుమారు వానికాలు జారుచుండెను. దారిప్రక్కలనుండిన చెట్లకొమ్మలు విఱిగి వాని పాదముల కడ్డముగఁ బడుచుండెను. వర్ష బిందువులు గాలివేగమున రాళ్లవలె వాని దేహమును మోఁదుచుండెను. వీని నేమియు లెక్కసేయక ముద్దుకృష్ణ పెద్దబాటచేరి, కొంతదూరమునడచి బైరాగి కుటీరముఁ గాంచెను. "దేవుజీ, దేవుజీ" అను పలుకులు విని బావాజీ తలుపుతీసి "ముద్దూ! ఏమి నీ సాహసము? లోనికిరా. ప్రాణములు పోఁగొట్టుకొనుటకే వచ్చినట్లున్నావు!" అనెను. ముద్దుకృష్ణ వానితో "దేవుజీ? ఈనాఁడు గాలివాన మిగుల బలిష్ఠముగానున్నది. మీయిల్లు నిలువదు. కాబట్టి మీరు మాయింటికిప్పుడే రండి!" యనెను.

చిఱునవ్వునవ్వి బాబాజీ "ముద్దూ! నీ వీవానలోనెందుకు వచ్చితివి? నా ప్రాణముల కేమివచ్చెను. గడువు దగ్గరపడినవానికిఁ గాపుగడలేల? తడిసిపోవుచున్నావే! లోనికిరా!" అని వాని నాహ్వానము చేసెను.

ముద్దుకృష్ణకు ఎటులైన బావాజీని తనయిల్లు చేర్చి రక్షింపవలెనని కోరిక. బాబాజీ మాత్రము "నా జీవముల కేమి! ముద్దూ! నీ రక్షణమును గుఱించియే ఆలోచించుచున్నాను. లోనికిరా! నీకేది శ్రేయమో యైదు నిముసములలోఁ జెప్పెదను," అని బాబాజీ పిన్నవానిని తొందరపెట్టి వానిని లోనికి బలాత్కారముగ లాగి మంచముమీఁదఁ గూర్చుండఁబెట్టెను.

ఒకింతసేపు ముక్కుచివరశ్వాసమును వ్రేళ్లతో జూచి, బావాజీ, "నీవు మంచిపనియే చేసితివి. ముద్దూ నేఁడు తుపానుగాలి గాఢముగఁ గొట్టుచున్నది. మేడలు మిద్దెలు కూలిపోవును. నీ విచటనే యుండిన నీ ప్రాణములు దక్కును." అని చెప్పెను.

"దేవుజీ! ప్రాణములయందు తీపి నాకు నేఁటితో తీఱిపోయినది! మీబోఁటి మహనీయులు సజీవులై యుండిన నాకుఁ జాలును. మీ రక్షణోపాయ మేమో నాకుఁ జెప్పుఁడు. నా ప్రాణములు గాలికి వదలివేయుదమనియే నాకోరిక!" అని ముద్దుపలికెను.

"హరిహరీ! ముద్దూ! పసితనముననే నీకేల యీ విపరీత విరక్తి? చాలుచాలు! ఇక్కడనుండుటయే నీకు శ్రేయము. ఇక్కడనుండి కదలకు!" అని బావాజీ వాని చేతిని బట్టుకొనెను.

"దేవుజీ! మీ యాజ్ఞ మీఱుటకు మనసొప్పదు. కాని యేమిచేయను? మీరక్షణమె నాకు పదివేలు! ఇంక నేనన్ననో, అప్పులవారిచేత అవమానపడి యంతరించుట కంటె వాయువరుణుల వాతఁబడి మడియుటయె మంచిది కదా!" అని ముద్దు తనచొక్కాను లాగికొని, ఇపుడు తలుపును మాటిమాటికిని మోదు జడి నెదుర్కొని "సెలవిండు, పోయివచ్చెదను దేవుజీ!" అని బైటికి దుమికెను. బావాజి యేమి సేయుటకును దోఁపక, ఖిన్నుఁడై, "ముద్దూ! మహాబలు నిట్లు నీ వెదుర్కొనుట మృత్యువు నెదుర్కొనుటయే! ఒక పక్షమున పరోపకారమునకే యిట్టి సాహసము కూడునుగాని అన్యచింత కనుచితము సుమీ!" యని హెచ్చరించెను.

బావాజీ, తన యీ కడపటి మాటలు ముద్దుకృష్ణ కర్ణరంధ్రములు చొచ్చెనాయని సందియమందనేకాని అవి వాని హృదయఫలకమునుగూడ భేదించుకొని పోఁజాలియుండెను! తన వ్యాజ్యముపోయి పరిస్థితులు వ్యత్యస్తమగుట, ప్రేమగౌరవముల కాస్పదమగు బావాజీ నీకష్టసమయమున రక్షణస్థానమును జేర్పలేకపోవుట ఇవి యన్నియు తన జీవితమునకు వైఫల్యమాపాదించు శత్రువులని ముద్దుకృష్ణ యెంచుకొని తనతలంపులకుఁ దలయూఁచునట్లుగనే యిపు డీప్రచండవాయువు వీచుచున్నదని తలపోసి, ప్రాణములు గోలుపోవుట కిదె యదనని మొదట నుద్యమించెను! ఐనను గురూత్తముఁడగు బావాజీవాక్కులు వాని బుద్ధిని పుణ్యచింతనమునకు ద్రిప్పుట కారంభించెను. దైవసంఘటనము లెంతటి యద్భుతములని తలపోయుచు ముద్దుకృష్ణ యా కుటీరము వెడలి, బైట నాలుగడుగులు వేసినతోడనే యతని కమితమగు బడలిక గలిగెను. పరోపకార మిసుమంతయైనఁ జేసి మఱి యసువులు వాసెదనని యా యువకుఁడు మీఁదఁబడు చెట్ల కొమ్మలను ద్రోసివైచుచు, కాలికడ్డమువచ్చు రాళ్లను తొలఁగించుచు వేవేగముగ పెద్దబాటను బోవుచుండెను.

ఇట్లు కొంతదూరము నడువగా, వానికొక మానుషశబ్దము వినవచ్చునట్లు తోఁచెను. కొంచెము పొంచి మెల్లగ నడుగులు పెట్టుచుండగా, వానిపాదమున కేదో మెత్తగదగిలెను. అంత చేతనున్నలాంతరులోని దీపము



"ఇక్కడనుండి కదలకు!" అని బావాజీ వాని చేతిని బట్టుకొనెను.

పెద్దది చేయగా రెపరెపమని కొట్టుకొని యాఱిపోవుచున్న దీపపువెలుగున మనుష్యుని దేహమతనికిఁ బొడఁగట్టెను. ఆ శరీరమున వేడిమి కానవచ్చుటచేతను, నాసిక నుండి శ్వాసము నడచుచుండుటచేతను జీవముండుట గుర్తెఱిఁగి, ముద్దుకృష్ణ వానిని దన బుజములమీఁద వైచుకొని వచ్చినదారినె వెనుకఁదిరిగి యడుగులు పెట్టెను.

ఎంతసేపు నడచినను వానికి బావాజీ కుటీరము కానరాదయ్యెను. మోమునను, కన్నులను జడివానగొట్టుచుండినను, అపుడపుడు ఆకసమునఁ దోఁచు మెఱపుల సాయమున నెట్టకేల కాతఁడు బావాజీ నివాసముచేరెను. కాని యందలి కుటీర మిపుడు నేలపాలయ్యెను. "అయ్యో! మృతులోకరి కిద్దరగుచున్నారే!" యని యలజడిపడి, క్రింది కొఱిగి పోయిన కుటీరముమీఁద మోఁది, "దేవుజీ, దేవుజీ!" అని యాపిన్నవాఁడు బిగ్గరగ నఱచెను. అంత కొంతవడికి, లోనుండి యొక హీన

స్వరము వినవచ్చెను. తాటియాకులకప్పు నొకింత సడలించి బావాజీ, "ఏమిబాబా! లోనికిరా!" అని పలికెను. ఎటులో సందు చేసికొని, ముద్దుకృష్ణ తాను ముందుగ లోనికిఁ బోయి, తాను దెచ్చిన మానవ కళేబరమును పిమ్మట లోనికిఁ గొనిపోయెను.

పైకప్పు పడిపోయినను, లోపల మాత్రము బావాజీ గృహము వెచ్చగ నుండెను. బావాజీ కరదీపికను జూపఁగా, మెట్ల మీఁద నడచి, ముద్దుకృష్ణ ఒక సారంగము సాచ్చెను. 'అం దొకమూల మంటవేసి యుండెను. పడిపోయి యుండిన యా మనుష్యుని దేహము వారు గుడ్డలతోఁ దుడిచి, యుష్ణోపచారములు చేసిరి. కాఁగుచుండు పాలలో నొకింత చూర్ణము గలిపి బావాజీ వానినోటఁ బోసెను. ఆమనుష్యుఁ డంత తెలివి నొంది కదలి, మాటాడఁజొచ్చెను.

చీఁకటిలోఁ బడి యుండిన యా మనుష్యుఁడు, తాను, చెన్నూరు చెన్నారెడ్డి సేవకుఁడననియు, తన యజమానుని కోడలి కానాఁడు ప్రసవ మాసన్న మగుటచేత మంత్రసానిని బిలుచుకొని పోవుటకై పొరుగూరికి బయలుదేరి, మార్గమధ్యమున గాలివాన తాఁకుడుచే పడిపోతి ననియుఁ జెప్పెను. చెన్నారెడ్డిపేరు వినఁగనే ముద్దుకృష్ణహృదయము తటతట కొట్టుకొనెను. రెడ్డి యాప్రాంతపు భూస్వాములలోఁ బేరెన్నిక గన్నవాఁడు. ముద్దుకృష్ణకుఁ బరిచితుఁడు. అతని యింటి కనేకపర్యాయములు వ్యవహారపుఁ బనులచేత, ఆ యువకుఁడు రాక పోకలు సలుపుచుండెడివాఁడు. కాని యిటీవల ముద్దుకృష్ణ యచటికిఁ బోవుట కంతగ నిష్టపడకుండెడివాఁడు. దీనికిఁగారణము లేక పోలేదు. రెడ్డి మనుమరాలు శ్యామల. శరీరసౌకుమార్యముతో సమానమగు బుద్ధి వికాసము గలిగియుండిన యా సుందరి, విద్యావతి యనియు, వినయ సంపన్న యనియు చుట్టుపట్టుల నెల్ల విఖ్యాతి నందెను. ముద్దుకృష్ణ తన సొంతపనులమీఁద చెన్నారెడ్డి దర్శనము చేసినపుడెల్ల, ఆ ముద్దియ ముఖసందర్శనభాగ్యముఁ గాంచుచుండును. ముద్దుకృష్ణ పట్టపరీక్షయందు గెలుపొందినవాఁడు; రెడ్డియువకులలో కుశాగ్రబుద్ధి గలవాఁడు; సమాన సుగుణావళి యున్నచోట్ల ప్రేమ స్నేహములు పెరుగునని పెద్దలు చెప్పుదురు. కావుననే శ్యామలా ముద్దుకృష్ణులు, అచిరకాలములోనే, ఒకరియెడ నొకరు అవ్యాజ ప్రేమ గలవారైరి.

చెన్నారెడ్డికి మాత్రము, విద్యాప్రేమములను నూతనకాలపు విషయములనిన తలనొప్పి. దీనికిఁ దోడు, ముద్దుకృష్ణ చితికిపోయిన సంసారస్థితిని జూచి పలుమారు రెడ్డి పరిహసించుచుండువాఁడు. ముసలి రెడ్డికి ధనమే ముఖ్యదేవత. ధనవంతులు కానివారలు నరనామమున కర్హులు కారని యాతని మతము! కావుననే రెండు మూఁడు మారులు తన మనుమరాలిని, ఈ ధనవిహీనుని నెయ్యము వీడుమని రెడ్డి హెచ్చరించెను. తా నాయువకునితో మాటాడుచుండునపు డిటీవల, కారణములేకయే రెడ్డి వానియెడల నిరసన భావముఁ జూపించెను. ఇది చూచి, రసజ్ఞతలేని యా పురుషుని గృహమునకు ముద్దుకృష్ణ రాకపోకలు చాలించెను.

ఇతఁడు చెన్నారెడ్డి పరిచారకుఁడని తెలిసికొనినపుడు, వానియెడల ముద్దుకృష్ణ మనస్సునను్న దయారస మింకిపోవునట్లు కానఁబడెను! కాని, ద్వేషాంకురములఁ గోసివైచి, ఇపుడు వారి స్థితిగతు లొకింత వ్యత్యస్తమగుటచేత, ఆప్రభు పరిచారకుల యెడల కనికరముఁ బూని, "ఓయీ! నీవు జరూరుపనిమీఁద వచ్చినను, బడలిక పడితివి కావున, ఇక్కడనే నిలిచి యుండుట శ్రేయము. నేను బోయి, మంత్రసానిని రెడ్డియింటికిఁ దోడ్కొని పోయెదను." అని ముద్దుకృష్ణ పలికెను.

ఈసారి ముద్దుకృష్ణ తుపానుగాలిలోఁ బోవుట బావాజీ కెంతమాత్రము నిష్టము లేదు. ఎవరికిఁ గాని యిపుడు బైట కాలు పెట్టుట శక్యము కాదు. మహారావములతో వాయుదేవుఁడు కనఁబడిన పదార్థము లన్నిటిని మోఁది బ్రద్దలు చేయుచుండెను. వానికి సాయపడి, వరుణుఁడు, భూమి తలమును వర్ష జలమున ముంపఁ జూచుచుండెను. రచ్చఁబడి విచ్చల విడిగ పాంథజనులను మోదు బందికాండ్ర వలె, ఈ రెండు భూతములు భూతజాలమంతటిని కొట్టి కోలాహలము చేయుచుండెను. ఈ యిరు

వురు మహాబలులను ధిక్కరింపఁ గల జగజెట్టి లెవరును జగతిని గానరానటులు దోఁచెను!

సత్యము మాత్ర మది కాదు. బలములలో బాహు బలము పటుతర మైనను, దానిని మించునది మేధాబలము. బాహ్యబలమును ధిక్కరింపఁగలది యంతర్బలము. జంతు జాలమునకు, వృక్షజాతికి, తుదకు జడప్రపంచమునకును యమస్వరూపమగు నీప్రచండవాయు వర్షసమయమందు తలయెత్తి నిలువఁగలవాఁ డొక మనుష్యుఁడే. రౌద్ర స్వరూపిణియు, పశుశక్తియుక్తయు నగు ప్రకృతికాంత నీసమయమున ధిక్కరించి సంచరింపఁ గలవాఁడు, సత్వ గుణప్రధానుఁడును, దయాశీలుఁడును నగు మనుజుఁడే. ముద్దుకృష్ణ, శత్రుమిత్రు లను భేదము పాటింపక, ఆపన్న యగు నా యబల సంరక్షణార్థమై యా జడివానలో, బావాజీయొద్ద సెలవుగైకొని, వాని దీవనలతో కుటీరము బైటికి వచ్చెను. మంత్రసాని యుండు గ్రామము వానికిఁ దెలిసినదే. అది చేరువనే యున్నను, ఆ సమయమున మాత్రము చేర నశక్యమగు ప్రదేశము. దారిలో పడుచు లేచుచు ముద్దుకృష్ణ యెట్లు నడచి యా పల్లె చేరెనో యతనికే తెలియదు. ఆ యూరఁగల యిండ్లలో ననేక ములు నేలఁబడిపోయెను. ఊరివారికైనను, ఆసమయమున మంత్రసానియింటి నానవాలుపట్టుట ప్రయాసకరము. ఎట్టకేల కాతఁ డొక యింటియొద్ద కేగి తలుపుతట్టి "కోటమ్మా?" యని బిగ్గరగ బిలిచెను. మంత్రసాని యట్టి సమయమున రాలేదని యింటివారు చెప్పివేసినను ఆ యువకుని మాట తీసివేయఁజాలక, కోటమ్మ బయలు దేరెను. రాత్రి పదిగంటలయ్యెను. అప్పటికి తుపాను అతి తీవ్రముగ నుండెను. బైట నిలుచుండుటయె దుష్క రము. శివకోపము పెట్టునట్టుగ నలుదెసలనుండియు రాళ్లు, కొమ్మలును వచ్చి శిరముపైఁబడుచుండెను. నడచు చుండువారిని, ఱెక్కలు లేకున్నను ఎగురఁజేయు ప్రభా వముగల వాయుదేవుఁ డాతటి సర్వస్వతంత్రుఁడై జగతిని సంచరించుచుండెను. కొంత నడచునప్పటికి కోటమ్మకు బడలిక రాఁగా, ముద్దుకృష్ణ యామెను బుజములమీఁద వైచుకొనిపోయెను. ఆయువకుఁ డపుడు నడచిన మైలును పదిమైళ్లవలెఁ దోఁచెను. ఎట్టకేల కతఁడు గమ్యస్థానము చేరునప్పటికి చెన్నారెడ్డి యిల్లు చిందఱవందఱగ నుండెను. మేడ పైయంతస్థు గూలిపోయెను. గదులమీఁదనుండి పెంకులు జారి పడుచుండెను. ఇంటనుండు వారంద ఱును రెండుమూఁడు చిన్నగదులలోఁజేరి ప్రాణములు దక్కించుకొనుచుండిరి. ఇంతలో గర్భవతికి నొప్పులు ప్రబలమయ్యెను. ఎన్నికష్టముల కోర్చుకొనినను, ఈ క ష్టము దాటఁగూడనిదికదా! ఈవిపత్సమయమున దమకు వైద్యుఁడుకాని, మంత్రసానిగాని లభ్యమగునాయని యిం టివారు ఇష్టదేవతలకు మ్రొక్కులిడుచుండిరి.

ఎవరో పిలువఁగ వారపుడు తలుపుతీసిరి. తాము జీవితము మీద నిరాశ చేసికొన్నను, కోడలికి సుఖప్రసవ మెట్లు చేకూరునాయని పలవించు చెన్నారెడ్డి కన్నులకు

చెన్నారెడ్డి కన్నులకు మంత్రసానిని తన భుజములనుండి దించుచున్న ముద్దుకృష్ణ యాకారము గజేంద్రవరదుని యాకృతివలె...బాఱద్రోలెను.

మంత్రసానిని తనభుజములనుండి దించుచున్న ముద్దుకృష్ణ యాకారము గజేంద్రవరదుని యాకృతివలె తట్టి, వాని

మీఁదతనకదివఱకుగల దురభిప్రాయమును బారఁద్రోలెను. ముద్దుకృష్ణ మాత్రము, అతనిసాగ్దతలఁ జెవిపెట్టక మంత్రసానికి జవ చేరు నుపాయము చేసెను. అంత నామె సాహాయ్యమున రెడ్డికోడలు కొన్నినిముసములకె సుఖప్రసవ మయ్యెను.

౪

ఇప్పటికి రాత్రి పదునొక్కగంట లయ్యెను. గాలివాన కొంత తగ్గునట్లు తోఁచినను, అట్లు జరుగ లేదు. వాయు దేవుఁడు దిశలుమాత్రము మార్చెను. ఇదియైనఁ గొంత యుపశమనముగ దోచినను, వేఱు దిక్కునుండి జగత్సంహార కార్య మారంభ మయ్యెను. ఇదివఱకు పడని యిండ్లు చెట్లునిపుడు కదలిపోఁజొచ్చెను. తాను మిక్కిలి బడలియున్నను, ముద్దుకృష్ణ, గృహస్థునితో, "అయ్యా! మీ పశువుల కొట్టము లదరిపోవుచున్నవి. వానిలోని పశువుల సంగతి యేమి?" అని ప్రస్తాపించెను. చెన్నారెడ్డికి తన పశువులే ప్రాణములు. ఐన నతడిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "నాయనా! మన ప్రాణములె యిట్లు అరచేతులలోఁ బెట్టుకొని యున్నాము. ఇంత 'భవంతి'లో మనకె తలదాఁచుకొనుట కష్టముగనున్నది. ఇంక పశువుల నెట్లు కాపాడఁగలము? వానిసంరక్షణము పరమాత్మునికే వదలివేయుదము!" ఇట్లు వారనుకొనుచుండఁగనే, గుభాలుమను చప్పుడయ్యెను. "అదిగో నాపశువులు మంటిలో గలసిపోవుచున్నవే!" అని యెలుఁగెత్తి రెడ్డిపలికి, నేలకొరిగెను. ముద్దుకృష్ణ ధైర్యముతో లాంతరు చేత బూని, "అయ్యా! మీ మనుష్యు లెవరైనఁగలరా? కొడవలి యెక్కడ?" అని యడిగెను. తలమాసి పున్నయ్య కొంచెము మత్తుతో మూలఁబడియుండెను. ముద్దుకృష్ణ, వానినొక కాలితాపుతో లేపి, వానిని దోడుకొని, ఇంటివారు వలదనుచుండగనే, పెరటిలో నడుగిడెను. కాని గాలి తీవ్రముగ వీచి వారి నింటిలోని కన్ని మారులో దొరలించెను. కాలహరణమునకు జింతించి, సాహసించి యాయిరువురును కొట్టముల దిశకేగిరి. వానిలోఁ గొన్ని నేలపాలయ్యెను. మిగిలినవి యూఁగుచు మిక్కిలి యపాయకరమగు స్థితియందుండెను.

వారిపుడొకకొట్టమునఁ జొచ్చిరి. ప్రాణోపద్రవ కాలమున బిగ్గరగనఱచుచు, తమ్ము బంధించిన త్రాళ్ళతో బెనఁగులాడుచుండు పశువుల త్రాళ్ళను, పున్నయ్య లాంతరు చూపుచుండగ ముద్దుకృష్ణ కొడవలితోఁ గోసివైచెను. కొన్నిపశువులు ఓపిక లేక, తమ త్రాళ్లుకోసి వేయనీయక గింజుకొనుచుండెను. ఎట్లో యాయిరువురును రెండవ కొట్టములోని పని ముగింపనున్నప్పుడు గాలి తీవ్రత బలమయ్యెను. కొట్టము గుభాలునఁ గూలెను. ముద్దుకృష్ణ తప్పించుకొనెనుగాని, తలమాసి కాలికి గాయము తగిలెను. ఇంకఁ దా నిలువఁజాలనని వాఁడు లాంతరచటనె పడవైచి యింటిలోనికిఁ బరుగెత్తెను.

చేయుచుండు పని కిట్లు విఘ్న మాపాదిల్లుటకు ముద్దుకృష్ణ వగచి, తానొకఁడే పశురక్షణకార్యము నిర్వహింపఁజూచెను. ఇంతలో నింటిలోనుండి యెవరో లాంతరుతో వానిదెసకు వచ్చుచుండిరి.

నడకనుబట్టి యది స్త్రీయాకారమని తోఁపఁగా, ఇంతవర్ష మునసే స్త్రీరా సాహసించు నని యతఁడాశ్చర్యపడెను. ఆమె యొక జవ్వని. ఆ తరుణి ధరించిన చలువవలువ, వర్ష దేవుని యీర్ష్యచేఁ దనచక్కఁదనమును గోల్పోయియు, యజమానురాలి యంగసౌందర్యమును గాపాడి తన సౌశీల్యమును స్థిరపఱుచుకొనెను. వర్ష జల సిక్తమగుటచే జెంపల నంటియున్న కురులు, ఆ యంగన ముఖపద్మము నానవాలుపట్టకుండ జేయుచుండినను, ఆ సుకుమారి చిఱునగవును, కన్నుల నునుకాంతియును, తనుస్వామిని గుట్టు బయలుపెట్టుచుండెను. వాయు వర్షములచే గాసిపడు జనుల సేవదేర్చుటకు భూతలమునకేతెంచిన దేవకన్యకవలె నాకాంత కనఁబడెను. అంత ముద్దుకృష్ణ, "శ్యామలా! గాలివానలో నీకీసాహసమేల? కఠినహృదయు డగు వర్ష దేవునికి నీకోమలదేహము ముద్దనుకొంటివా? వెంటనె లోనికి మరలిపో!" అని పలికెను.

కాని శ్యామల మాత్రము, "నాథా! నే నింతసేపును మీకష్టము నూరక కిటికీనుండి యాతురతతో కనిపెట్టునప్పటికంటె చినుకులలోఁబడి మీకు సాయము చేయ వచ్చిన యిప్పుడె, హాయిగ నున్నది! పరోపకారుల పరి

చర్యల మరగిన మాకు ఇంటిపనులమీఁద నీసడింపేకదా! ఐనను నేనువచ్చినది మీకుతోడ్పడుటకుఁ గాదు. నాముద్దుదూడల సంరక్షణమునకే! కూఁగుచున్న యీకొట్టములో నావెల్లదూడయును, పడిపోయిన యీ పాకలో నా నల్లలేఁగయుఁ నున్నవి. వీనిని ముందు విడిపింపవలయును!" అని పలికెను.

అంతట శ్యామల లాంతరు చూపగా ముద్దుకృష్ణ ఆయా కొట్టములలోనికి బోయి, దూడలను విప్పివేసెను. తనకుఁ ప్రియములగు గోవు లివి యని మాటవరుసకా స్త్రీ యనెనేకాని, గోజాతిమీద నంతయు ఆ జవ్వనికవ్యాజప్రేమము గలదు. కావుననే బోరున గురియు నా వర్షమున నా తరుణు లిరువురును పశుగణమును మృత్యుముఖమునుండి తప్పింపఁగలిగిరి.

పడిపోయిన కొట్టములనుండి చనిపోవు పశువుల యఱపులు వారి వీనులకు వినవచ్చుచుండెను. అట్టి ప్రదేశములకుఁ బోయి యా యిరువురును, తమ చేతుల కంది నంతవఱకును పశువుల మెడ పలుపులు గోసివైచిరి. కాలు స్వాధీనముగనుండిన యావులు తప్పించుకొని పారిపోయెను. లేవలేకుండువానిని ముద్దుకృష్ణ చేటి కీడ్చివైచెను. కాని యన్నిటికి నతఁడిట్లు సాయముచేయ నేరకుండెను. కొట్టమునడ్మ పడిపోయి, తల చితికి, రక్తము స్రవించుచుండ, నాలుక చైటవేసి, నిలువుగ్రుడ్లుపడిపోయిన గోవులనుజూచి శ్యామల విలపించెను. ఇట్టి ఘోరదృశ్యములు, ఆ మృదుహృదయ కన్నులఁ బడుటకు ముద్దుకృష్ణ కిష్టము లేదు. ఏ పురుషుఁడైనఁ దనకీతరుణమున సాయపడినచో, శ్యామల నింటిలోని కంపివైచి, యవసానదశనుండి పెక్కుగోవులను దాను దప్పింపఁగలనని యా యువకుఁడు తలంచుచుండునపుడె, ఇంటిలోనుండి వచ్చెడి మనుష్యునిచేతనున్న లాంత రతనికన్నులకు బొడగట్టెను. "బాబా! ఎక్కడనున్నావు? బ్రదికియుంటివా!" అను నార్తనాదము వాని వీనులకుఁ దట్టెను. ఇట్లు ముద్దుకృష్ణ నేమ మారయుచు వచ్చినది బావాజీ.

ఆ ప్రళయకాలమున, స్వసౌఖ్యమునువీడి, గోసంరక్షణమును చేయుచుండెడి యా తరుణులను జూచి, బావాజీ ఆనందపరవశుఁడయ్యెను. ఆ ముదిత శ్యామల యగుట తెలిసికొని బావాజీ, "బాబా! ఇపుడుగదా నా కన్నులు ధన్యతనొందెను! సౌజన్యమున మీ రొకరి కొకరు తీసిపోరు. ఒకరికొక రెంతయు తగియున్నారు. ఇప్పుడీ మాటలకేమి గాని, యీ వానలోఁ దడిసి, యీ మోటుపనులు చేయుట ఈ కోమలి కనుచితము! నేను నీకు తోడ్పడెదను!" అని చెప్పివేసి, యామె నింటిలో దిగవిడిచి వచ్చెను.

అంత బావాజీ, ముద్దుకృష్ణ చేతనున్న కొడవలిని దీసికొని "నాయనా! నీవు శ్రమపడి యున్నావు. నాకు దీపము చూపించుము. నేను పశువులనువిడిపించెదను" అని పలికి, గోసంరక్షణ కార్యమునకు దిగెను.

ఇట్లు వారు తమ పని పూర్తిచేసికొని, పారిపోవుచును, పడిపోవుచును నుండు పశువులను దప్పించుకొని ఎట్టకేలకు నింటిలో నడుగిడిరి. శీతవాతముచే కొయ్యఁబారిన వారి దేహములకు సేకము గలుగుటకై రెడ్డిమంటవేసెను. వారు కట్టుకొనుటకు పొడివస్త్రము లిచ్చెను. అప్రార్థితముగ నీయిరువురు పురుషులును తమ కీకష్టకాలమున సాయము చేయుట తలపోయఁగా, రెడ్డికి మతి భ్రమణము గలుగుచుండెను. ఇట్టి దయార్ద్రహృదయుల మానవులకు సాధ్యమా యని యతఁడు నిర్విణ్ణుఁడయ్యెను.

ఇప్పటికి రాత్రి యొంటి గంటయయ్యెను. వాన జోరు తగ్గిపోయెను. "మన మింటికేల పోఁగూడదు?" అని ముద్దుకృష్ణ యనఁగా, బావాజీ వానిని వారించి, "నాయనా! నీవు మిక్కిలి డస్సిపోతివి. నీ ప్రాణము లీనాఁడు నిలిచి యుండునని నేననుకొన లేదు. నేఁడు నీ గండ మిత్తరుల మీఁదుగా పోయినది! నీకిఁక భద్రమే. కాని కొంచెముసేపు నిద్రించితివా స్వస్థపడుదువు." అని బావాజీ బ్రతిమాలినను, యువకుఁడు వినక, "దేవుజీ! ఈ లోక సంక్షోభసమయమున కూర్కెవరికిఁబట్టును? ప్రాణభయముచేత ప్రజలు నిరాహారులై యీ రేయి జాగరణము చేయుచున్నారు. చంటి పిల్లలు సయితము తమ తల్లుల యొద్ద పాలు ద్రావ మఱచిరి! ఇట్టి విపత్సమయమున

జనుల వెతల దీర్చుటయె జీవిత పరమార్థము గదా. నాకు నిద్రావిశ్రాంతులతో పనిలేదు. మీ సెలవుగైకొని పోయి వచ్చెదను. మీ రిచట విశ్రమించి, వేకువనె యింటికిఁ బొండు. నేనడుగుట మఱచితిని! మీ రీ గాలివానలో నిల్లెల వెడలివచ్చితిరి?" అని ప్రశ్నించెను.

బావాజీ "నాయనా! పసివాండ్ర కెపుడును వారి ధోరణియెకాని, వేఱు ప్రసక్తిలేదు. పెద్దవాండ్ర మగు మావి గూడ మానవ హృదయములే సుమీ! జడి వానలో బయలు వెడలిన నీకొఱకు, లేఁగను బాసిన గోవువలె నేఁ బరితపించితిని. వెఱ్ఱిదుఃఖము నా మనస్సు నావహించెను. నిశ్చేష్టితుఁడ నైతిని. కొంతసేపటికి మోహము తెలిసికొనిన నా అంతర్నేత్రము నెదుట, రక్త ప్రవాహము మధ్యమున, మృత్యువు సన్నిధిని, తాండవ మాడు నీయాకారము పొడఁగట్టెను. ఇఁక నా కాళ్లాడి నవి కావు. సారంగమున నిద్రించు మనుజునితో పనిమీఁ దపోయివచ్చెద నని చెప్పి, నేనిల్లు వెడలితిని. నిన్నుఁ జేరవలె నని మనస్సున నెంత వ్యామోహమున్నను, కాళ్లలో సత్తువలేదు. ఐనను, గాఢాంధకారమునఁబడి, మహాబలు నెదుర్కొని, యీ యూరి మొగమైతిని. అడుగడుగునకును అడ్డంకులే. రాళ్లురప్పలు, గతుకులు గండ్లు, తప్పించుకొని, యెట్లో యింటికి వచ్చి నిన్నుఁ జూచి ప్రాణములు నిలువఁబెట్టుకొను నాశ ప్రేరింపఁగా నేను నడచితిని. ఇట్లు వేగముగ నడుగులు వేయుచుం డఁగ నా కాలొకపడిపోయిన చెట్టునకుఁ దగిలి నే నేలఁ బడిపోతిని. ఎట్లో తెప్పిరిలి, మరల పైనము సాగించి, యిచటఁ జేరితిని. ఇఁక కార్య సాఫల్యమైనది!"

వీరి సంభాషణముతో వేకువ సమయ మయ్యెను. ఇప్పటికి వానయు, గాలియుఁ బూర్తిగ నణఁగి పోయెను. ఇఁకఁ బోయి వచ్చెదమని బావాజీ, ముద్దుకృష్ణులు చెన్నారెడ్డి యొద్ద సెలవు తీసికొని ఇంటిదెసఁబట్టిరి.

౨

ఇపుడు రస్తామీఁద బాహాటముగ నడువ వీలు లేదు. అసంఖ్యాకములగు చెట్లు, కొమ్మలును, దారికడ్డ ముగఁ బడియుండెను. అట్టిచోట్ల నడకసాగుట యసాధ్యము. ఎటులో నడచి బావాజీముద్దుకృష్ణులు, పడిపోయిన బావాజీ కుటీరమునొద్దకు వచ్చిరి. లోనికి వచ్చి కొంచెము సేపు అలయికతీర్చుకొని మఱి పొమ్మని బావాజీ చెప్పినను, తన యింటి సేమమును, ఊరి సమాచారమును గనిపెట్టవలయునని ముద్దుకృష్ణ వెడలిపోయెను. ప్రభాతసమయమునఁ గలకలనవ్వుచుండెడి మిన్నూరుగ్రామ మిపుడు పాడువారియుండెను. పడిపోయిన చెట్లు, కూలి పోయినయిండ్లు, చనిపోయిన జీవరాసులను జూచి ముద్దుకృష్ణ కన్నుల నీరు గ్రమ్మెను. సగము జీవముతో నఱచుచుండు గోవులను, కొనయూపిరితోఁ గొట్టుకొను చుండు సన్నజీవములను జూచి, చేయున దేమియు లేక యా యువకుఁడు శోకించెను. పేదవారలు తమకుటీరము లుకూలి, తమయాస్తియంతయు నేలపాలగుటకు విలపించుచుండిరి. భాగ్యవంతులకును వనట లేకపోలేదు. తమ కొట్టములు గూలి పశువులు మగణించినవనియు, గాదె లుపడి ధాన్యాదులు మంట గలిసెననియు భూస్వాములు పలవించుచుండిరి. గాలివానకు గాసినొందని గృహస్థు లచట నెవరును లేరు. నష్టపడినవారి యోగక్షేమ మరయుచును, కష్టదశ నున్నవారికిఁ జేతనైనసాయము చేయుచును ముద్దుకృష్ణ తనయింటి దెసకుఁ బోయెను. ఇపుడతని యిల్లెచ్చట నున్నది? ఆ గ్రామమందలి గృహములలో మేటి యనఁదగు వారి మేడ, ఆనవాలుపట్టుటకు వలనుపడని విధమున నేలపాలయ్యెను!

శిథిలమైన యాగృహము నొద్దఁ జేరి, యచట ప్రభాతభాను నెదుట నిలుచుండునపుడు, పాపము ముద్దుకృష్ణకుఁ గన్నుల నీరు క్రమ్మెను. "ఆహా? దైవ మీకుటుంబమున కెంతటి యాపద తెచ్చిపెట్టెను! మా పరిస్థితులవలెనే మాగృహమును జితికి నేల పాలయ్యెను. అప్పుల వారిచే కాఁగల కార్యము గాలివానయె తీర్చినది! దైవ సంఘటనలు దాటఁ గూడనివిగదా? ఐన వగచిన పని యేమి?" అని యతఁడు ధైర్యము తెచ్చుకొని, ఇపుడు తన సేమమెఱిఁగి సంతసించిన యింటి వారలకుఁ దా నింటి పనులందుఁ దోడ్పడెను. ఎట్టి విపద్దశలయందైనను సజ్జనులకు సత్కార్యాచరణమున కవకాశములు గలుగుచునే యుండును. తమ యిల్లు పోయినను, సజ్జ

గాదె నిలిచి యుండుట కతఁ డెంతయు సంతోషించెను. ముద్దుకృష్ణ మనసున నపు డొక సత్కార్యాచరణమును సంకల్పించు కొనెను. సర్వస్వము కోలుపోయి యల్లాడుచుండెడి యా గ్రామమందలి పేదవారల నతఁడు రప్పించి, కొన్ని దినముల వఱకును వారికిఁ గావలసిన వడ్లు వారికిచ్చెను. ఈ స్వల్పసాహాయ్యమే యా పేదలకు పదివేలుగ నుండెను.

ముద్దుకృష్ణ కిపుడు తన యూరివారల నుద్ధరించుటయె ముఖ్యకర్తవ్య మయ్యెను. తన పెరఁటిలోను తోఁటలలోను బడిపోయినచెట్లు, ఇండ్లు కట్టుకొనుటకై పేదల కతఁ డిచ్చివేసెను. అందు వలన నందఱికిని మేలు సమకూరెను. చెట్లు పడుటవలన నడచుటకు వలనుపడని ప్రదేశములు శీఘ్రమె చక్కఁబడెను. తమ కిన్ని విధములఁ దోడ్పడిన యా పరోపకారియెడ నందఱికిని గౌరవానురాగములు మిక్కుటమయ్యెను. గ్రామమంతయు వెంటనే పరిశుభ్రమయ్యెను. కావుననె మిన్నూరు గ్రామమున కుళ్లినయాకులు, చనిపోయిన జంతుకళేబరములు తక్కిన ప్రదేశములందువలె వారముల కొలఁది నేల నిలచియు, నీట మురిగియు దుర్గంధములు వెదఁజల్లియు రోగవ్యాపనమునకు తావియ్యక శీఘ్రమె భూగర్భమునఁ జొచ్చి, భావికాలపుసస్యముల కుపకరించు నెరువుగఁ బరిణమింప మొదలిడెను.

౬

తుపాను సంభవించిన కొన్ని దినముల వరకును మిన్నూరు గ్రామమున ముద్దుకృష్ణకు తలయెత్తుటకైన తీరిక లేనంత పని గలిగి యుండెను. కావుననే మనసున నెన్నిమారులో బావాజీని గుఱించి యతఁ డనుకొనినను పోయి యాయన దర్శనము చేయ వలను పడకుండెను. ఒకనాఁ డతఁడు తీఱిక చేసికొని, బావాజీని జూచెను. బావాజీ మంచమునుండి లేవలేక పోయినను, చిఱునవ్వుతో ముద్దుకృష్ణను కుశల ప్రశ్నము చేసెను. గాలివాన రాత్రి తగిలిన దెబ్బవలన బావాజీ కాలు వాచెను. ఇన్ని దినములవఱకును ఆయన సేవ మారయకుండుటకు ముద్దుకృష్ణ నొచ్చుకొనెను. బావాజీ వానినివారించి, "ముద్దూ! నీవు గ్రామమునకు చేయు సేవా సమాచారము నాకుఁ దెలిసి సంతోషించితిని. ఈతాపత్రయముచేతనే నీ ముద్దుమొగమున ముదిమి గానవచ్చుచున్నది! నీ పరోపకారబుద్ధి గాలివాన రాత్రియె నా కగపడినది. ఒడలుదాఁచుకొనక ప్రజాసేవ చేయుచుండుము. ఇదియె నిజమైన పౌరుషము. దీని వలననే నీకు శత్రుసంహారమును, మిత్రసంపాదనమును జేకూరును. శత్రువు లనిన జ్ఞప్తి వచ్చినది మీ వ్యాజ్యము సమాచార మేమైనఁ దెలిసినదా?"

ముద్దుకృష్ణ "చిత్రముగా నున్నది. ఏ సమాచారమును దెలియలేదు. ఒక స్నేహితుఁడైనను దెలియఁ బఱిచినాఁడు కాఁడు. తంతియుఁ జాబును గూడ లేవు!"

బావాజీ:—"మన కిదివరకు బాగా తెలిసినది కాదు. గాలివానకు తంతి తీఁగలు తెగిపోవుటవలన తంతి వచ్చుచుండుట లేదు. ఆ కారణముననే రయిలు కూడ లేదు. కావున జాబులు లేవు. దీనికై నీవు పరితపింప నక్కఱ లేదు. మీరు మంచి దినములు తిరిగి చూతురు.



"దేవుజీ! గెలిచినాము!"

ఈమాటలు బావాజీ పెదవుల నుండఁగనే తపాలుజవాను జాబులనుఁ తంతిని దెచ్చి ముద్దుకృష్ణ చేతనుంచెను. తంతి విప్పుకొనుచునే యా యువకుఁడు ఒక గంతిడి, "దేవుజీ! గెలిచినాము!" అని యానందాశ్రువులు దాల్చుచు, బావాజీని కౌఁగిలించుకొనెను.

బావాజీ వాని నభినందించి "ఎంతబాధపడితివి బిడ్డా! నేఁటితో మీ కుటుంబపు బాధలు పరిసమాప్తి నొందినవి. ఎల్లకాలము నమవస నిశలేనా? నిండు వెన్నెలలు కురియుచుండఁగా శీఘ్రమె రారాజును బోలిన నీకీర్తి ధగధగ మెఱయఁగలదు! లేలెమ్మ!" అని కన్నతండ్రి కొమరుని లాలించునట్టుగ నాయువకుని లాలించెను.

అంత వారిరువురు నిట్లు సంభాషించిరి. ముద్దుకృష్ణ "దేవుజీ! ఈ తంతిలోను జాబులలోను గల సమాచారములు సత్యమేనా! మా సంసారమున కెన్నఁటికైన సౌఖ్యదినములు వచ్చునా? ఆ నెల్లూరి వారి చేతులలో నుండి మాకెప్పుడైన విముక్తి కలుఁగునా?"

బావాజీ—ముద్దూ! నీవేల యింకను సందియపడుచున్నావు? కాలచక్ర మెప్పుడును ఒకరీతినే తిరుగదు. నెల్లూరునగర మెట్లు నష్టపడినదో మనకుఁ దెలిసినదిగదా. చూచి వచ్చిన చెంగారెడ్డి చెప్పినాఁడు, పాడుపడి సకలదుర్గంధములకు మూలకందమైన యా నెల్లూరు నగరమునకంటె కుగ్రామమగు మన మిన్నూరె మిన్నగ నున్నదని చెప్పెను. కావుననే, పిల్లలు కూడ

'నెల్లూరు నేల పాలైతే,
మిన్నూరు మిన్ను ముట్టును!'

అని వీథులలో పాడి సంతసించుచున్నారు.

"ముద్దు—దేవుజీ!

'నెల్లూరు నేల పాలయితే మిన్నూరు మిన్ను ముట్టును!'

అను సామెత కింకేమైన అర్థము చేయవచ్చునా? మావిరోధులు నెల్లూరులో నిపుడు పొందిన నష్టమునకును మాకిపుడు లభించిన లాభమునకును, ఏమైన సామ్యము చెప్పుకొనఁగూడదా!"

బావాజీ—"అర్థముల కేమి కొదువ? అన్వయము చేసికొను వారి చమత్కృతిని బట్టి సుద్దుల సారస్యము తేటపడుచుండును! దీనికేమిగాని, నీకు సిరితోపాటింకొకశుభముకూడ సమకూరునట్లున్నదోయి ముద్దూ! నీకు చెప్పమఱచితిని. నీకొఱకు రెండుమూఁడుసారులు చెన్నారెడ్డి కబురుపంపినాఁడు. తుపాను రాత్రినుండియును నీపేరు వారియింట రామస్మరణ యైనదని చెప్పుచున్నారు. పిమ్మట విశూచి ప్రబలినపుడు చెన్నూరుగ్రామమునకు నీవు సేవాసమితివారిచేఁ జేయించిన సహాయమువలన చెన్నారెడ్డి నీకత్యంతప్రియుఁడైనాఁడు. నీకేవో పెద్ద బహుమతి రెడ్డి యీయనున్నట్టుగ వినుచున్నాను. అన్నిటికేమిగాని, నీకొక బహుమాన మిచ్చిన సర్వోత్తమము సుమీ?"

ముద్దు: "అదియేది, దేవుజీ?"

బావాజీ: "మఱచితివా, ముద్దూ! నీహృదయేశ్వరి శ్యామలయె!"

౭

ఇంత గాలివానకొట్టి ఇన్ని దురవస్థలకు దీనజనులు లోనయినపుడుగాని, చెన్నారెడ్డికి ముద్దుకృష్ణ యెడల దురభిప్రాయము పోలేదు. అనాదిగా నెల్లూరు చెన్నూరు రెడ్లకు, మిన్నూరువారిమీద వైరములు గలవు. కాలానుగతముగ నవి సమసిపోయెడివె. కాని, పౌరుషమె ప్రధానమైన యా రెడ్డికుల శేఖరులకు పూర్వవైరముల పెనచుచుండుటయె తమ కులధర్మమని తోఁచి, వారు, తదనుగుణముగ నడచుకొనుచుండిరి. ఐనను, చెన్నారెడ్డి మనసునకు ముద్దుకృష్ణ ప్రజ్ఞానుగుణములు నచ్చి, ఆ యువకునకు మంచి యరణముతో దన మనుమరాలి నొసంగ నిపుడతఁ డుద్యుక్తుడయ్యెను. ఇంతలో ముద్దుకృష్ణ సంసారస్థితిగతులు వ్యాజ్యపు తీర్పుమూలమున బాగుపడుట కూడ తటస్థించెను. కావున శ్యామలా ముద్దుకృష్ణుల పరిణయపుసమాచారము జనులు విని మిక్కిలి సంతోషముతో,

"నెల్లూరు నల్లూరు నేలపాలైనపుడు,
చెన్నూరు మిన్నూరు చెలిమితోనుండు!"

అని పాటలు పదములు పాడుకొని, వినోదింప సాగిరి.

ముద్దుకృష్ణ తన మనోహారిణి శ్యామల తనకులభించుట కెంత ముదమందినను, తమ మండల మిట్టి కష్టదశ యందుండునపుడు తాను వివాహభోగము లనుభవించుట యనుచితమని నమ్మి, తా నొకవత్సరము వఱకును పెండ్లి మాట తలపెట్టనని నిశ్చయము చేసికొనెను. దీనివలన స్వజన కవిజన హృదయములకు గొంత యాశాభంగము గలుగునటు లయ్యెను. కాని, బావాజీ యొకనాఁడు ముద్దుకృష్ణను బిలువనంపించి, "బాబా! నిన్ను గుఱించిన నా కోరిక లన్నియు నీడేరెను. నే నిపుడు దూర దేశయాత్ర కట్టవలసి యున్నది. కన్నతండ్రివలె నీపెండ్లి కన్నులారగాంచి మఱి పోవలెనని యున్నది!" అని పలికెను. బావాజీ యభీష్ట లేశమును జెల్లింపఁ గలుగుట ముద్దుకృష్ణకు మహాప్రసాదము. కావున శీఘ్రకాలములోనె శ్యామలా ముద్దుకృష్ణుల పరిణయ మతి వైభవముగ జరిగెను. ముద్దుకృష్ణ సంతోషము మిన్నుముట్టునట్టుండెను. బావాజీ యానందమునకు మేరలేనట్టుగ దోఁచెను.

౮

ఒకనాఁడు బావాజీ ముద్దుకృష్ణకు వర్తమాన మంపెను. తుపానురాత్రినుండియు బావాజీకి దేహస్వాస్థ్యము తప్పియుండెను. నాఁటిరాత్రి తగిలిన దెబ్బవలన నతని కాలు వాఁచెను. ఎన్ని చికిత్సలు చేసినను ఆవాఁపు తీయకుండెను. జ్ఞానవైరాగ్యవిషయములంకాదేక వైద్యమునందును ప్రవీణుఁడని బావాజీ యా ప్రాంతములందు ప్రసిద్ధి కెక్కెను. ఇఁక యోగవిద్య యాతని సొమ్మే. ఇన్ని విద్యలుండియు బావాజీ తనకాలు నెమ్మదిపఱచుకొనలేకుండుటఁ జూచియందఱు నాశ్చర్యపడిరి. బావాజీ కీప్రాంతము లందుండుట కిఁక నిష్టము లేదనియును, కొలఁది కాలమున నే హిమాచలప్రాంతములకో వెడలి పోనున్నాఁడనియును పలువు రనుకొనిరి. ఇట్టి వారిలో ముద్దుకృష్ణ యొకఁడు.

కుటీరము సొచ్చి బావాజీని చూచినంతనే యేలయో కానిముద్దుకృష్ణ కానాఁడు దుఃఖము పొంగిపొరలి వచ్చెను. బావాజీ కాలు పొంగియుండెను. ఆయన ముఖమున ధవళిమఁ గానబడెను. పెదవులయందు రక్తిమ తోఁపకుండెను. ముఖము వివర్ణత నొందియుండెను.

దైన్యముచేఁ దడఁబడిన గొంతుతో ముద్దుకృష్ణ, "దేవుజీ! ఏల మీరిటు లున్నారు? మీ యారోగ్యము క్షీణించుచున్నదే. మనస్సు వ్యాకులతనొంది యున్నదే. మీసేవ చేయుటకు నేను సంసిద్ధుఁడను." అని చెప్పెను.

బాబాజీ: "బాబా! ఈశ్వరానుగ్రహ మిట్లున్నది. నేనిఁక జీవింపను. నీతోఁ గొన్ని రహస్యపు మాటలు చెప్పి మఱి ప్రాణములు విడిచెదను."

బావాజీ కిపుడు బలహీనత హెచ్చుచుండెను. ఆవేదనతో దుఃఖ ముప్పొంగుచుండెను. కంఠస్వరము హీనమయ్యెను. అతని శయ్యయొద్దకు ముద్దుకృష్ణ వచ్చి వినుచుండెను.

బాబాజీ: "నేను మిన్నారి రెడ్లవంశమువాఁడను." అని యారంభించినతోడనె, ఆశ్చర్యమున ముద్దుకృష్ణ లేచి, "నేనెన్ని మారులో అట్లే అనుకొంటిని. కాని, చెప్పండి." అనెను.

బావాజీ: "మల్లారెడ్డి జ్యేష్ఠ పుత్రుఁడను—" అని యతని నోటినుండి రావేగమె, ముద్దుకృష్ణ ఒకగంతుతో బోయి, రోగిని గౌఁగిలించుకొని, "తండ్రీ! ఏల నీవింత కాలమువఱకును నీ సంగతి మఱుగుపఱిచితివి? జనకుని వలెనే నిన్ను హృదయమున భావించుకొంటిని. ఇంకను చెప్పండి!" అని పలికెను.

బావాజీ: "మన కుటుంబపు స్థితిగతులు తారుమారగుచుండుటచేత, నాకింటిమీఁద రోఁత జనించి, దేశములపాలై పోతిని.

ఉత్తరహిందూస్థానమేగి, కొందఱు మహనీయుల యనుగ్రహమున యోగశాస్త్ర మభ్యసించి, వైద్యశాస్త్ర రహస్యము లనేకములు గ్రహించి, దేశసంచారము చేసి, చిరకాలమునకు మరల నీప్రాంతముల కేతెంచితిని. అప్పటికి మన పెద్ద లనేకులు గతించిరి. చిన్నలలో పలువురు కుత్సితవృత్తులఁ దగిలి, కుటుంబ ధనమును కొల్ల పెట్టుచుండిరి. నీవు బాల్యముననుంటివి. సన్న్యాసినైనను కుటుంబ

గౌరవమును, నీపురోవృద్ధినిగోరి, ఇచట నేనిలిచియుండుట కుద్యమించితిని. అట్టిచో, ఏపుణ్యక్షేత్రములు నేదర్శించుటకుఁ బోయినను, మనస్సుమాత్ర మిచటనే యుండుననుట స్పష్టము. కావున నిచటనే ప్రచ్ఛన్నముగనుండి, నీ సేమ మారయుచు, లేనిపోని సంబంధములుమాత్రము కలిగించుకొనక, నామార్గము నేఁ జూచుకొనుచుండుట లెస్సయని మనస్సును సమాధానపఱుచుకొంటిని.

"పూర్వము నన్నెఱింగిన పెద్దలు గతించుటవలన నన్నీనూతనాశ్రమమున నెవరును గుర్తింపఁజాలరైరి. అందువలన మెల్లఁగ నిచట కుటీరము వేసికొని ఒకకన్ను నీ మీఁదను,ఒకకన్ను పరమాత్మునిమీఁదను నుంచి దినములు గడుపుచుంటిని. మెల్ల మెల్లఁగ నీతో స్నేహము కలిపితిని. ఎప్పటి కప్పుడు నీమనసు గ్రహించి, అది సన్మార్గమునఁ జరించునటులు పదిలపఱుచుచుంటిని. ఇదియె నా ముక్తి మార్గ మనుకొంటిని. చెప్పుట కేమి యున్నది? ఇప్పటికి నా యైహికకష్టములు తీఱినవి. నామనస్సు కుదుటఁబడినది. ఇఁక మృత్యుముఖము నపేక్షించుచున్నాను."

తండ్రికొడుకు లిరువురి కన్నులనుండియు నశ్రుకణములు సంతతధారగ నోలుకుచుండెను. అంత పుత్త్రుఁడు తీఱనిమోహమున జనకుని కౌఁగిలించుకొని, "నాయనా! కొన్నిదినములైనను నేనీనూతన బాంధవ్యసౌఖ్య మనుభవింపగూడదా? మీ మరణమున కింతటి యాకస్మికత్వ మేల?" యని యడిగెను. బావాజీ, "నాయనా, అజ్ఞానముచే నీ వడుగుచున్నావు! నా గడువు సమీపించినది గావుననే, మనసంబంధ మిప్పుడు బయలుపడినదనుకొనఁ గూడదా? భూలోక నివాసముతోఁ దనివిఁ జెందితిని. అది యెంత దీర్ఘమైన నంత దుఃఖావహము!

"తుపానురాత్రితో నాకు జీవితము దెస విముఖత్వము గలిగెను. వైధవ్యదశ నందినటులైన ప్రకృతిసోదరి నీ కన్నులతో నేఁ జూడనొల్లను! నశించిన గృహములు, భవనములును మరల వెలయఁగలవుగాని, దీర్ఘకాలము పెరిఁగి లోకమున కలంకారభూతములై ఒక్కపెట్టున నశించిన యీ మహావృక్షములు తిరిగిరావుగదా. పెక్కండ్రు జనులను, నోరులేని జీవరాసులను ఈ తుపాను తన పొట్టఁ బెట్టుకొనెను. సోదరసమానులగు వీరందఱితో నేనేలఁ బోఁగూడదు? వారిది నిర్బంధమరణము, నాయది స్వచ్ఛందము!

"వ్యామోహమునఁబడక, నన్నిఁక వదలివేయుము. ధరణిని జిరకాలము ధర్మమునకై ధైర్యమునఁ బోరాడుము. నిరతము నీకు జయమగుగాఁక-శ్రీహరి"—

మాటలు పూర్తిగాక మున్నే, బావాజీగొంతులో గురకపుట్టెను. చూపు వికారమును బొరసెను. బావాజీ పరమపదము నందెను.

మిన్నూరు బాట దగ్గఱ నూతనముగ పెద్దసమాధి వెలసినది. అచట నొకమఠము స్థాపించి ముద్దుకృష్ణారెడ్డి, శాశ్వతముగ దానిని జరుపుటకై యేర్పాటులు చేయుచున్నాఁడు.